క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభ స్వామి వ్రతం



అనంతపద్మనాభ స్వామివ్రతం ఆచరిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : భాద్రపద శుద్ధ చతుర్ధి పర్వదినం సందర్భంగా గురువారం స్థానిక దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో అనంత పద్మనాభ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష పంచామృత అభిషేకాలు నిర్వహించి, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులు సామూహికంగా వ్రతాలు ఆచరించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. క్షేత్రం అర్చకుడు ప్రతాప కృష్ణ కిషోర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘు నాయకులు

ఏలూరు (టూటౌన్): కవికోకిల, కవి విశారద, కవి సామ్రాట్ గుర్రం జాషువా జయంతి కార్యక్రమం స్థానిక నరసింహరావుపేటలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ కులవ్యవస్థలో సాహిత్య పరంగా ఎన్నో అవరోధాలు వచ్చినా సాహిత్యాన్ని వదలకుండా తన మేధాశక్తితో ముందుకెళ్లిన మహోనీయుడు గుర్రం జాషువా అని కొనియాడారు. సాహిత్యంలో కేంద్ర సాహిత్య అవార్డు తీసుకున్న గొప్ప సాహిత్య వేత్త జాషువా అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుబాబు, కోటి, కనికెళ్ల మురళీకృష్ణ, కె.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెదవేగి: అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోన్న ఏలూరు సమీపంలోని పోణంగి గ్రామానికి చెందిన నందమూరి గ్రాబ్రియేల్, మరియమ్మలకు అమ్మ సంస్థ సభ్యులు గురువారం రూ.8 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అమ్మ అసోసియేషన్ చైర్మన్ ఫాదర్ చుక్కా డొమ్నిక్, ప్రెసిడెంట్ చుక్క అవినాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే ఆళ్ల నాని



మహిళలకు కట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఆళ్ల నానిని కలిసిన దుర్గాప్రసాద్

ఏలూరు (టూటౌన్): కుట్టు మెషీన్ల ద్వారా మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆకాంక్షించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన పలువురు మహిళలకు కుట్టు మెషీన్లను అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు పలువురు మహిళలు తమ జీవనోపాధికి కట్టు మెషీన్లు అందించాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. వారి కోరిక మేరకు కుట్టు మెషీన్లను అందజేశామని చెప్పారు. తాము అడిగిన వెంటనే కుట్టు మెషీన్లు అందించిన ఎమ్మెల్యే నానికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మధ్యాహ్నపు బలరాం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్‌ను బలోపేతం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పితాని దుర్గాప్రసాద్ గురువారం ఆళ్ల నానిని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నానికి పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం అమలు చేయని న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు మంజూరు చేసి నిధులు విడుదల చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకోవడానికి ప్రతి నెలా రూ.5 వేలు చొప్పున అందిస్తున్నట్టు చెప్పారు. ఏపీపీ, ఏజీపీ, జీపీ వంటి నామినేటెడ్ పోస్టుల్లో నూటికి 70 శాతం బడుగు, బలహీన వర్గాల న్యాయవాదులకు అవకాశం కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆచంట వెంకటేశ్వరరావు, డీవీ రామాంజనేయులు, లీగల్ సెల్ నాయకులు కురెళ్ల రాంప్రసాద్, మున్నుల జాన్ గురునాథ్, నేతల ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న బిల్డింగ్ వర్కర్స్ సెంటర్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దళిత హక్కులు, సామాజిక న్యాయం, అసైన్డ్ భూముల చట్ట సవరణ రద్దు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. డప్పు కళాకారులు, చర్మకారులకు 45 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని, శ్మశానాలకు ఇచ్చిన జీఓ 1235 అమలు చేయాలని, దళిత గిరిజనులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎం.ఇస్సాక్, పి.బాలరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు

ఏలూరు (టూటౌన్): రవాణా రంగం కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు కోరారు. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన జీపు యాత్రను గురువారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో జిల్లా సీనియర్ నాయకులు బి.సోమయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.సూరిబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు సాధనకు అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సంఘం అక్టోబరు 6న దేవవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో చలో రాజభవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు జి.రవీంద్ర, బి.శ్రీనివాసరావు, పాపినీడు, బోళ్ల నాని తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రచార యాత్రను

జగనన్న ఆరోగ్య సురక్షకు సర్వం సిద్ధం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

పెదవేగి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ విజయవంతానికి సర్వం సిద్ధం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోకవర్గ ప్రత్యేకాధికారి జీవీవీ సత్యనారాయణ ఆదేశించారు. ఈ నెల 30న ప్రారంభించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి గురువారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వైద్య ఆరోగ్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న ఆరోగ్య సురక్షకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శుక్రవారం సాయంత్రానికి సర్వే పూర్తిచేయాలని అన్నారు. వైద్య శిబిరం వద్ద నలుగురు వైద్యులు అందుబాటులో ఉంటారని, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉదయం 9 గంటలకే వైద్య శిబిరం ప్రారంభం కావాలన్నారు. తహసీల్దార్ నల్లమెల్లి నాగరాజు, ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్, డాక్టర్లు మాధవి, ప్రత్యూష, సీహెచ్‌ఓ రోజ్‌మేరీ, సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఏవీఆర్ మోహన్‌కు సత్కారం



డాక్టర్ ఏవీఆర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఎముకల ప్రత్యేక వైద్య నిపుణులుగా, ఏలూరు జిల్లా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్‌గా, డీసీహెచ్‌ఎస్‌గా విశేష సేవలు అందించిన డాక్టర్ ఏవీఆర్ మోహన్ నూజివీడు ప్రభుత్వ హాస్పిటల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏవీఆర్‌ను ఏలూరు సర్వజన ఆసుపత్రి ఆవరణలోని ప్రభుత్వ వైద్యుల సంక్షేమ సంఘ భవనంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఏలూరు జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి పాల్ సతీష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ మోహన్ ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన కాలంలో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏలూరు సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎం.శశిధర్, ఆర్ఎంఓ శ్రీనివాసరావు, హాస్పిటల్ చీఫ్ ఫిజీషియన్ పోతుమూడి శ్రీనివాసరావు, కంటి వైద్య నిపుణులు ఏఎస్ రామ్, చీఫ్ గైనకాలజిస్ట్ ఎన్.పద్మ, న్యూరో సర్జన్ బంకా రవికుమార్, పారామెడికల్ సిబ్బంది, నర్సులు, వైద్యులు, కార్మికులు ఏవీఆర్‌కు వీడ్కోలు పలికారు.

భగత్‌సింగ్ ఆశయాలు ఆదర్శనీయం



భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపు నిచ్చారు. భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా స్థానిక 39వ డివిజన్‌లోని భగత్‌సింగ్ సెంటర్లోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మత సామరస్యానికి, లౌకిక వ్యవస్థకు నష్టం వాటిల్లే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు భగత్ సింగ్ స్ఫూర్తితో పనిచేయాలన్నారు. భగత్‌సింగ్ విగ్రహానికి పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, నాయకులు గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు పూలదండలు వేసి నివాళులర్పించారు.

సబ్‌స్టేషన్లలో సాంకేతిక సమస్యతో అంధకారం

- 15 గంటల పాటు శ్రమించి సరఫరా పునరుద్ధరణ
- పర్యవేక్షించిన విద్యుత్ శాఖ ఎస్ఈ, అధికారులు



భీమడోలులో విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఈ సాల్మన్‌రాజు

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అయితే సుమారు 15 గంటల పాటు సిబ్బంది శ్రమించి సరఫరాను పునరుద్ధరించారు. గత రాత్రి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్రేక్ డౌన్ తర్వాత సరఫరా ఇస్తుండగా ఒక్కసారిగా భీమడోలులోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తి 12 ఫీడర్లలో 9 ఫీడర్లు ఫాడయ్యాయి. దీని వల్ల సూరప్పగూడెం, గుండుగొలను సబ్‌స్టేషన్లకు వెళ్లే కండక్టర్లు, తీగలు దెబ్బతిన్నాయి. దీంతో ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని గుండుగొలను, సూరప్పగూడెం, కోరుకల్లు, రత్నాపురం, వడ్డిగూడెం, ఆగడాలలంక, చెట్టున్నపాడు తదితర గ్రామాల్లోని విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం ఏర్పడింది. ఆ శాఖ అధికారులు వెంటనే స్పందించి పనులు చేపడుతుండగా భారీ వర్షం కురవడంతో తీవ్ర ఆటంకం కలిగింది. ఎస్ఈ సాల్మన్‌రాజు పర్యవేక్షణలో డీఈ శశిధర్, ఏడీఈ కె.గోపాలకృష్ణ, ఏఈ రామస్వామి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. గుండుగొలను, సూరప్పగూడెం గ్రామాలకు పోతునూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేశారు. గురువారం మధ్యాహ్నం వరకు సిబ్బంది శ్రమించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి అన్ని గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

యెర్నేని మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): రైతాంగ సమస్యలపై తుది శ్వాస విడిచే వరకూ పోరాడిన రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్ మృతికి ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ తీవ్ర సంతాపం, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. ఎర్నేని మృతి రైతాంగ ఉద్యమానికి తీరని లోటని పేర్కొంది. యెర్నేని నాగేంద్రనాథ్ సేవలను సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్‌లు కొనియాడారు.

స్వామినాథ్ మృతికి సంతాపం

హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథ్ మృతికి ఏపీ రైతు సంఘం సంతాపం తెలిపింది. ఆహార వృద్ధిలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని, తన పరిశోధనలతో మేలైన వరి వంగడాలను సృష్టించారని పేర్కొంది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్, రామన్ మెగసెసె లాంటి ఎన్నో పురస్కారాలు ఆయన అందుకున్నారని గుర్తు చేసింది.

బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బండి



బండి వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఎన్నిక య్యారు. ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు బాపట్లలో జరిగిన రాష్ట్ర మహాసభల వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. తనతోపాటు ఏలూరు జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కుంచె వసంతరావు, రాష్ట్ర సమితి సభ్యులుగా బత్తుల వెంకటేశ్వరరావు, గోలిమే బాలయేసు, కూరాకుల బాబురావు ఎన్నికైనట్టు తెలిపారు. రాష్ట్ర మహాసభల స్ఫూర్తితో రానున్న రోజుల్లో భూ సమస్యలపై పోరాడతామన్నారు. కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో చేర్చి రాష్ట్రంలో భూములు లేని దళితులకు ఇతర పేదలకు మిగులు భూములు, అడవి బంజరు భూములు పంచాలని బండి కోరారు.

నేడు భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి: మండలంలోని భోగాపురం సచివాలయం పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు జానంపేట బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు

దెందులూరు: రహదారులపై భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగించడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ ఊకలోడు లారీలు, వాహనాలను రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	21

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-08
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	40
కాకర కాయలు	24	కీరా దోస	40
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	88
క్యాబేజీ	24	అల్లం	120-240
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	32	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	06
దోసకాయలు	20-24	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	--

రైతుల శ్రమదానంతో తూడు తొలగింపు

గణపవరం: తమ పొలాలకు సాగునీరు అందకపోవడంతో రైతులంతా కలసి శ్రమదానంతో పంటకాల్వలో తూడు తొలగించుకున్నారు. కొందేపాడు గ్రామానికి అత్తిలి కాల్వనుంచి కొమ్మర పంటకాల్వ ద్వారా సాగునీరు అందుతుంది. ఈ పంటకాల్వ నిండా తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో సరిపడా నీరు అందడం లేదు. సాగునీరు సక్రమంగా అందక సుమారు 200 ఎకరాలలో వరి చేలు నీటి సమస్య ఎదుర్కొంటున్నాయి. అడపాదడపా వర్షాలు పడుతూ ఉండటంతో వరిచేలు ఎండిపోయే ప్రమాదం తప్పింది. నీరులేక పొలాలలో నేల గట్టిబడిపోవడంతో ఈనిక దశలో ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయం అత్తిలి ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామ సర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు చొరవతో ఆయకట్టు రైతులు గురువారం శ్రమదానంతో పంటకాల్వలో తూడు తొలగించుకున్నారు. దీంతో కొంతమేర సమస్య తీరినా పూర్తిస్థాయిలో సాగునీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు ఈ సమస్య నుంచి తమను గట్టెక్కించాలని కోరుతున్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన గురుకుల విద్యార్థినులు



విద్యార్థులు జిల్లా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కె.జయరాజు, ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, పీడీ కృష్ణకుమారి తదితరులు

భీమడోలు: అంతర్ జిల్లాల సౌత్ జోన్ జూనియర్, సీనియర్ అండర్-23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల స్పోర్ట్స్ స్కూలు విద్యార్థినులు 9 మంది సత్తా చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అంతేకాక వీరిలో వి.రంజని, సీహెచ్ భార్గవీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోలసానిపల్లి బాలికల గురుకుల కళాశాలలో గురువారం సంబంధిత వివరాలను జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.జయరాజు, ప్రిన్సిపల్ ఎం.పద్మావతి వెల్లడించారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 హైజంప్ విభాగంలో డి.మహాలక్ష్మి కాంస్యం, అండర్-16 విభాగం 300 మీటర్ల పరుగులో వి.రంజని బంగారు, మూడు కిలోమీటర్ల నడకలో సీహెచ్ భార్గవీ వెండి పతకాలను సొంతం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరంగల్‌లోని హనుమకొండలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్-16 రెండు కి.మీ. పరుగులో జే.పల్లవి కాంస్యం, 800 మీటర్ల పరుగులో యు.అర్చన కాంస్యం, మిడిల్ రిలే పరుగులో ఎం.పూజ వెండి పతకాన్ని సాధించారు. అండర్-18 విభాగంలో 5 కేఎం నడక పోటీల్లో సి.రక్షిత నాగేశ్వరీ కాంస్యం, 2 కేఎం స్టీపుల్‌చేజ్ పోటీలో పి.సౌజన్య బంగారు, 2 కేఎం స్టీపుల్‌చేజ్ పోటీలో బి.నీలిమ వెండి పతకంతో పాటు మిక్సిడ్ రిలే (4 ఇన్‌టూ 400) పోటీలో బంగారు పతకాన్ని సాధించి తమ సత్తా చాటిందన్నారు. క్రీడాకారులను, పీడీ కృష్ణకుమారిని అభినందించారు. కళాశాల పీడీ సాయిలక్ష్మి, అధ్యాపక, అధ్యాకేతర సిబ్బంది పాల్గొన్నారు.